


# వాణిశ్రీ • అర్ధనారీశ్వరుడు

స్మృతి గుడికి వెళ్ళి తిరిగివస్తూ లారీ ప్రమాదంలో చనిపోయింది. కాలనీలోని వాళ్ళంతా ఆత్మబంధువు పోయినట్లుగా బాధపడ్డారు. స్మృతి చాలా మంచిదని పేరు తెచ్చుకుంది. ఆమె గురించి ఎటువంటి వివాదమూ లేదు. పెద్దగా చెప్పుకోవడం ఆ కాలనీలో వాళ్ళు ఎరగరు. ఆమె తన పనేమిటో తను చేసుకుపోతుంది. పిల్లల్ని బడికి పంపి, భర్తని ఆఫీసుకి సాగనంపుతుంది. వాళ్ల వెళ్ళేటప్పుడు గుమ్మంలో నిల్చుని టా...టా చెప్పి చెయ్యి ఊపుతుంది. ఎన్నో

ఏళ్ళుగా ఇరుగుపొరుగువాళ్ళు క్రమం తప్పకుండా చూసిన దృశ్యం అది. తమ కుటుంబం గురించి ఇరుగుపొరుగువాళ్ళకి ఏమీ చెప్పేది కాదు. ఎవరయినా తమ సంగతులు చెప్తున్నా ఆసక్తి చూపేది కాదు. అటువంటి ఉత్తమురాలు అకాల మరణం పొందటం ఎంతటివారికైనా బాధ కలిగిస్తుంది.

ఇక ఆమె భర్త బాబూరావు సంగతి చెప్పనక్కరలేదు. అతను ఆడపిల్లకంటె అన్యాయంగా ఏడుస్తున్నాడు. స్మృతి లేకుండా తను జీవించలేనని గోరున విలపిస్తుంటే, అతనితో పాటు అంతా దుఃఖించారు. భార్య చనిపోయినపుడు భర్త దుఃఖించటం మామూలేగాని ఇలా శవంమీద పడి గంటల తరబడి గోరున ఏడవడం చాలా అరుదైన విషయం.

పోస్టుమార్టమ్ చేసి తీసుకొచ్చిన స్మృతి శవం, ముఖం మాత్రమే కనిపిస్తున్నది. యాక్సిడెంటు తాలూకు భయంతో ఆమె అనుభవించిన బాధ ముఖంలో ఇంకా కనిపిస్తున్నట్లే వుంది.

స్మృతి తల్లి, తండ్రి బావమరుదులు టాక్సీలో వచ్చారు. వాళ్ళని చూస్తూనే బాబూరావు దుఃఖం రెట్టింపు అయింది.

“మావయ్యా, స్మృతి లేకుండా నేను బతకలేను. నేను కూడా ఆ కట్టెల్లో పడి కాలిపోతాను.”

“అత్తయ్యా! పిల్లల్ని చూసే బాధ్యత మీదే. స్మృతి లేని ఈ లోకంలో ఒక్క రోజు కూడా వుండలేను.”

బాబూరావుతో పాటు, అతని మామ, అత్త, బావమరుదులు ఏడుస్తుంటే ఇరుగుపొరుగు ఆడవాళ్ళు కూడా పెద్దగా విలపించారు. మగవాళ్ళు దుఃఖం ఆపుకోలేక అక్కడ్నుంచి దూరంగా వెళ్ళారు.

పాడె తయారయింది. పక్కింటి రామచంద్రమూర్తి అన్నీ చూస్తున్నారు. స్మృతి అంతిమయాత్రకు ఏర్పాటు చేస్తున్నారు. కాలనీలో మగవాళ్ళు ఆఫీసులకు వెళ్ళలేదు. అంత్యక్రియలకు హాజరు కావడానికి సెలవు పెట్టారు.

బాబూరావు పనిచేస్తున్న ఆఫీసు స్టాఫ్ చాలామంది వచ్చారు. వాళ్ళందర్నీ పేరు పేరునా పలకరించి ఏడుస్తున్నాడు.

ఇక స్మశానానికి బయల్దేరవలసిన సమయం ఆసన్నమైంది. బాబూరావుని స్నానం చెయ్యమన్నారు. కాని అతను ఒప్పుకోవడం లేదు.

“నాకు కొత్తబట్టలు తీసుకురండి” అని పేచీ పెట్టాడు.

“ఇప్పుడు కొత్తబట్టలు ఎందుకు?”

“స్మృతికి కొత్తచీర కట్టారు కదా!”


“శవానికి కొత్త బట్టలు తొడిగి తీసుకెళ్ళడం ఆచారం బాబూ!”

“నేనూ శవాన్నే.”

“ఛీ... ఛీ... అవేం మాటలు.”

“లేదు నేనూ స్మృతితో పాటు కాలిపోతాను” అన్నాడు బాబూరావు.

“పోయినవాళ్ళతో పాటు మనమూ




పోతామా? అయినా మీకు పిల్లలున్నారు. వాళ్ళని ఎవరుచూస్తారు? వాళ్ళకోసమైనా నువ్వు ధైర్యంగా వుండాలి"

"నాకు ధైర్యంలేదు నేను పిరికి వాడిని. స్మృతిలేకుండా ఒక్కరోజు బతకలేను. దయచేసి ఎవరూ అడ్డు చెప్పకండి. నేను స్మృతితోపాటు చచ్చి పోతాను" బాబూరావు చేతులెత్తి నమస్కారం పెట్టాడు.

ఎవరికీ ఏం తోచడంలేదు.

పక్కింటి రామచంద్రమూర్తిని పిల్చి తెల్లకాగితం తెప్పించాడు. తనకు రావలసినవన్నీ మామగారి పేరున రాశాడు. పిల్లల్ని చూసే బాధ్యత వాళ్ళకే అప్పగిస్తుంటే అంతా చేష్టలుడిగి చూస్తుండి పోయారు.

"లేయ్ బాబూ! ఏంటి నీ పిచ్చి... లే లేచి స్నానం చెయ్యి. ఇప్పటికే ఆలస్యమయింది" కృష్ణమూర్తిని వచ్చి బాబూ రావుని పట్టుకుని పైకి లేవదీస్తూ అన్నాడు

"నాకు పిచ్చేరా...పిచ్చి పట్టింది" అంటూ కృష్ణమూర్తిని కౌగిలించుకున్నాడు.

కృష్ణమూర్తి బాబూరావుకి కొలీగ్. కృష్ణార్జునుల వంటివారు. నాటకాల్లో బాబూరావు హీరో వేస్తే, కృష్ణమూర్తి విలన్ వేస్తాడు. జంటకవుల్లా కలిసి మెలిసి తిరుగుతుంటారు.

యాక్సిడెంట్ జరిగి ఇరవై నాలుగు గంటలు గడిచింది. ఇంకా శవాన్ని వుంచే వీలులేదు. అంతా తొందర పడుతుంటే బాబూరావు మొండిగా కదలక పోవడంతో ఇంకా ఆలస్యం కాసాగింది.

"లాభంలేదు. భార్యని కాలుస్తుంటే బాబూరావు చూడలేడు. ఇతని వాలకం చూస్తుంటే చితిలోకి దూకి సహగమనం చేసేటట్లు వున్నాడు. మనం అతన్ని

ఆపలేం. ఆ సమయంలో అతనికి పిచ్చి బలం వస్తుంది" అన్నాడు రామచంద్ర మూర్తి.

"నిజమే. బాబూరావు మొండిమనిషి. అన్నంతపని చేస్తాడు. మనం జాగ్రత్త పడటం మంచిది."

"ఇప్పుడేం చెయ్యాలి?"

బాబూరావు ముఖ్య బంధువులు, కాలనీలో పెద్దలు, కొలీగ్స్ మీటింగ్‌లాంటిది పెట్టారు. ఇటువంటి అనర్థం జరగకుండా వుండాలంటే పోలీసుల్ని పిలిపిస్తే మంచిది అనే నిర్ణయానికి వచ్చారు. పోలీసులకు కబురుపెట్టారు. అరగంటలో అరడజనుమంది పోలీసులు, ఇన్‌స్పెక్టర్ వచ్చారు.

ఇన్‌స్పెక్టర్ కూడా బాబూరావుకి ఎంతో చెప్పిచూశాడు. బాబూరావు వినటంలేదు.

చచ్చిపోయిన భర్తతో పాటు, ప్రాణాలు తీసుకుంటామని ఏడ్చే భార్యని చూశాడు గాని, ఇలా భార్యకోసం చచ్చిపోతానని మొండికెత్తిన వాడిని ఇన్‌స్పెక్టర్ ఎక్కడా చూడలేదు. బాబూరావుకి మెంటల్ డిజార్డర్ మొదలైందేమోనని సందేహించాడు. ఆమాటే అక్కడివాళ్ళతో అన్నాడు. అర్థనారీశ్వరుడు అని మెచ్చుకున్నాడు భార్యని సగభాగంగా భావించి ప్రేమించేవాళ్ళు ఎందరున్నారు?

భార్య సడెన్‌గా పోయిందన్న షాక్‌తో మతి భ్రమించినట్లుంది. ఇక లాభంలేదు. అతను లేకుండానే శవాన్ని తీసుకెళ్ళండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అదేం? అదెలాగండీ. భార్య శవానికి భర్త అంత్యక్రియలు చెయ్యాలి. అది సాంప్రదాయం" అని ఒక ముసలాయన అన్నాడు.

"నిజమే? ఇప్పుడతనికి పిచ్చి పట్టింది. మనం బలవంతంగా స్మశానానికి తీసుకెళ్ళినా అతన్ని పట్టుకోలేం. పిచ్చెక్కినవాళ్ళకి ఏం తెలుస్తుంది? ఆ చితిలోకి దూకుతాడు. ఆ తర్వాత మనమేమీ అనుకొని లాభంలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అంతా నిజమే అనుకున్నారు.

"కాని శవాన్ని తీసుకెళుతుంటే బాబూరావు ఊరుకుంటాడా? వెంటబడి వస్తాడు గదా!" అన్నాడు రామచంద్ర మూర్తి.

"నిజమే" అని మళ్ళీ ఆలోచనలో పడిపోయాడు ఇన్‌స్పెక్టర్.

అది కూడా ఒక సమస్యే. బాబూరావుని ఆపడం ఎలా?

"కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. బాబూరావు చితిలో పడి చచ్చిపోయాడే అనుకుందాం. పెద్ద గొడవ జరుగుతుంది. దేశంలో సంచలనం కలుగుతుంది. 'సతీ సహగమనం' అని పెద్ద పెద్ద అక్షరాలతో పేపరువాళ్ళు గొడవచేస్తారు. అతగాడి అత్తమామల్నే కాకుండా,

అందుకు ప్రోత్సహించావని మనల్ని గూడా అరెస్టు చెయ్యొచ్చు" అన్నాడొక నిత్య శంకితుడు.

అంతా భయంగా చూశారు.

"అఫ్‌కోర్స్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఇబ్బందిగా చూస్తూ.

అందరికీ రూప్‌కన్వార్ సతీసహగమనం వ్యవహారం గుర్తుకొచ్చింది. నిజంగా బాబూరావు చితిలోపడి చనిపోతే ఈ కాలనీలో మగాళ్ళని పోలీసులు వదిలిపెట్టరు అనే నిజం స్పష్టమైంది. అయోమయంలో కొట్టుకున్నారు కొందరు.

"ఎట్టి పరిస్థితిలోను బాబూరావుని స్మశానానికి రానివ్వకూడదు. పిచ్చివాడి చేతిలో రాయి ఎవరికి తగులుతుందో ఎవరికి తెలుసు?"

"మరి ఎలా?"

"డాక్టర్ని పిలిపించి మత్తు ఇంజెక్షన్ ఇప్పిద్దాం. అంతకంటే మరో మార్గం లేదు" చెప్పారు రామచంద్రమూర్తి.

అంతా బాగుందన్నారు.

ఇన్‌స్పెక్టర్ తల ఊపాడు.

ఒక యువకుడు స్కూటర్ ఎక్కాడు డాక్టర్ని పిలుచుకురావడానికి.

ఇంతలో పోలీసువాన్ వచ్చి ఆగింది అందులో నుంచి దిగాడు క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్.

ఇన్‌స్పెక్టర్లు ఇద్దరూ గుసగుసలాడుకొంటే అక్కడివారికేమీ అర్థంకాలేదు చాలాసేపు. ఏరియా ఇన్‌స్పెక్టర్ ఎందుకో చాలా ఆశ్చర్యపోతున్నాడు.

"బాబూరావుని అరెస్ట్ చెయ్యాలి!" క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ గంభీరంగా ప్రకటించాడు.

అందరి మనసుల్లోనూ ఒకటే ప్రశ్న. ఎందుకు?

"స్మృతిని చంపించింది బాబూరావే. భార్యను వదిలించుకున్న తర్వాత అతను నళినిని పెళ్ళిచేసుకోవాలని పథకం వేశాడు. స్మృతిని ఢీకొని యాక్సిడెంట్ చేసిన లారీకి నళిని తమ్ముడు డ్రైవర్. ఇంటరాగేషన్‌లో అతను ఇంతకుముందే నిజం చెప్పాడు" క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ చెప్పాడు.

పోలీసులు బాబూరావు చేతులకు బేడీలు తగిలించారు.

తాము చూస్తున్నది నిజమా? కలా? అన్నట్లు అంతా శిలావిగ్రహాల్లా నిలబడిపోయారు.

* * *